తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 74 26-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.



ఆంధ్రప్రదేశ్ ను కలినరీ టూరిజం హబ్‌గా

అభివృద్ధి లక్ష్యం

- ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ తో పర్యాటకశాఖ ఎంఓయూ..!
- ఏపీ పర్యాటక శాఖ ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ మధ్య ఎంఓయూ
- సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం
- తెలుగు వంటకాలను ప్రపంచానికి పరిచయం చేసే ప్రయత్నం
- ప్రాంతీయ ఆహార సంస్కృతికి ప్రాధాన్యం..

రాష్ట్రంలో పెరుగుతోన్న పర్యాటకుల ఫుట్ ఫాల్‌కు అనుగుణంగా హోటల్ గదులు, హోం స్టేలను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యాటక శాఖకు దిశానిర్దేశం చేశారు. 2029 నాటికి రాష్ట్రంలో 50 వేల హోటల్ గదుల నిర్మాణం లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అలాగే వివిధ పర్యాటక ప్రాంతాల్లో 10 వేలకు పైగా హోం స్టేలు కూడా అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. హోంస్టేలను అందుబాటు లోకి తీసుకువచ్చే అంశంపై ఎలాంటి పరిమితీ లేదని వివరించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షకు మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని

ఏప్రిల్ మొదటి వారంలో 1.12 లక్షల ఇళ్లిస్తాం

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంప్రతిష్టాత్మకం...
- రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక...
- స్థానికసర్పంచ్‌లకూ పూర్తి అధికారం
- ఇళ్లలో ఉండకుంటే ఇతరులకు కేటాయింపు...
- ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి టోల్ ఫ్రీ నంబర్

మిగతా 2లో

తెలంగాణలో మరో కొత్త పార్టీ..

- మార్చి 27న ప్రకటించనున్న కవిత..
- ముహూర్తం ఖరారు..

పాకిస్తాన్ "బ్రోకర్ దేశం", మనం కాదు..

ఇరాన్ యుద్ధం ఆపేందుకు పాక్ మధ్యవర్తిత్వం..

ఆల్ పార్టీ మీట్‌లో ఇచ్చిపడేసిన జైశంకర్..

పెట్రోల్ కొరత..

- కొన్నిచోట్ల యాజమాన్యాల 'నో స్టాక్' బోర్డులు
- పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన
- సోషల్ మీడియాలో వార్తలు, వదంతులతో కలవరం
- కిక్కిరిసిన బంకుల్లో పడిగాపులు
- అవసరం లేకున్నా ట్యాంకులు నింపుకుంటున్న వైనం
- హైదరాబాద్‌లో ట్రాఫిక్ జామ్‌లు

హైదరాబాద్‌లో సరిపడా నిల్వలు

కంపెనీలు, డీలర్లదీ అదే మాట

హైదరాబాద్: ఇంధనం సెగ రాష్ట్రంలోని వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తోంది. ఆయిల్ కొరత వార్తలు వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అయితే దేశంలో ఎక్కడా చమురు కొరత లేదని కేంద్రం స్పష్టం చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే విషయం పదేపదే చెబుతోంది. ఆయిల్ కంపెనీలు సైతం సరిపడా డీజిల్, పెట్రోల్ నిల్వలున్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రకటనలిస్తున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. హైదరాబాద్ మహానగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా గత రెండు

మిగతా 2లో

మంగళగిరిలో ఘనంగా రామాలయ పునఃప్రతిష్ఠ..

రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన నియోజకవర్గమైన మంగళగిరిలో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని కొప్పురావుకాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న లోకేశ్‌కు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక టీడీపీ నాయకులు, ప్రజలు సాదర స్వాగతం పలికారు. అనంతరం పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ హనుమత్, లక్ష్మణ, సీతాసమేత రాముల వారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లోకేశ్, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పునర్

మిగతా 2లో

రామతీర్థం గిరిప్రదక్షిణ మార్గాన్ని వర్చువల్ గా ప్రారంభించిన డిప్యూటీ సీఎం..!

అమరావతిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థం గిరిప్రదక్షిణ మార్గాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, పార్లమెంట్ సభ్యులు అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం మాధవి పాల్గొన్నారు. సీతారామునిపేట

మిగతా 2లో

ఇరాన్‌కు అమెరికా 15 ప్రతిపాదనలు

- అంగీకరిస్తే నెల పాటు కాల్పుల విరమణ
- తిరస్కరించిన ఇరాన్, అమెరికాకు 8 షరతులు
- ఒప్పుకుంటేనే యుద్ధం ఆగుతుందని స్పష్టికరణ
- కొనసాగిన ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర దాడులు
- అబ్రహంలింకన్ యుద్ధ నౌకపై దాడి: ఇరాన్
- మందెబ్ జలసంధినీ మూసేస్తానని హెచ్చరిక
- కువైట్ విమానాశ్రయంలో భారీ మంటలు

ఇస్లామాబాద్: పశ్చిమాసియా కల్లోలానికి తెర దించే దిశగా బుధవారం మరిన్ని కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. యుద్ధాన్ని ఏదోలా ముగించే ప్రయత్నాల్లో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఈ విషయమై ఇరాన్ ముందు 15 ప్రతిపాదనలుంచారు. వాటికి అంగీకరిస్తే తొలుత నెల రోజుల పాటు కాల్పుల విరమణకు సిద్ధమని పేర్కొన్నారు. కానీ వాటిని ఇరాన్ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది.

మిగతా 2లో

కాంగ్రెస్‌కు జీవన్‌రెడ్డి గుడ్‌బై

- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు రాజీనామా లేఖ.. నాలుగు దశాబ్దాల ప్రయాణానికి సెలవు
- రేవంత్‌రెడ్డి ప్లాన్ ప్రకారం పార్టీలో చేరి సీఎం అయ్యిండు
- పార్టీని సొంత ఆస్తిగా భావిస్తున్నాడు
- అడ్డొస్తే తొక్కుతా అంటున్నారు.. ఎంత మందిని తొక్కుతారు..?
- చంద్రబాబు, కేసీఆర్‌నే ఎదిరించా.. ఇక రేవంత్‌తోనే పోరాటం

కార్యకర్తల సమావేశంలో జీవన్‌రెడ్డి

2లో

ఆంధ్రప్రదేశ్‌ను కలినరీ టూరిజం హబ్‌గా అభివృద్ధి లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

బాలాజీ సహా పర్యాటక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదం తెలియజేసిన టూరిజం ప్రాజెక్టులు వేగంగా ఏర్పాటు అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలు, నగరాల్లో జాతీయ, అంతర్జాతీయ హోటల్ బ్రాండ్లు వచ్చేలా చూడాలని సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి కూడా రాజమహేంద్రవరం సహా వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హోం స్టేల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. హోం స్టేల నిర్వహణకు సంబంధించి రేటింగ్ కూడా పెట్టాలని దిశానిర్దేశం చేశారు. అరకు, చింతపల్లి, ముంచింగిపుట్టు, గాంధీవనం, మారేడుమిల్లి తదితర ప్రాంతాలతో పాటు కనీసం 10-15 ప్రాంతాల్లో కారావాన్ పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. కారావాన్లను పార్కింగ్ చేసుకుని కుటుంబంతో సురక్షితంగా ప్రకృతిని ఆస్వాదించేలా ఆయా పార్కుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎక్స్ పీరియన్స్ కేంద్రాల వద్ద కూడా ఈ తరహా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. తిరుపతి, విశాఖలలో అమ్యూజ్ మెంట్ పార్కుల ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సీఎం సూచనలు జారీ చేశారు. అటవీ, దేవాదాయ శాఖల సమన్వయంతో ఎకో, టెంపుల్ టూరిజానికి ప్రోత్సాహం ఇచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రసాద్, స్వదేశ్ దర్శన్ పథకాల కింద వివిధ దేవాలయాలు, దర్శనీయ స్థలాల అభివృద్ధికి చేపట్టిన ప్రాజెక్టులను 2026 మే నాటికి సిద్ధం చేయాలని అన్నారు. దీనికి సంబంధించి మరో రూ.663 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు పర్యాటక శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

పాకిస్తాన్ "బ్రోకర్ దేశం", మనం కాదు..

మిడిల్ ఈస్ట్ సంక్షోభం నేపథ్యంలో ఈరోజు(బుధవారం) ఢిల్లీలో ఆల్ పార్టీ సమావేశం జరిగింది. ఇరాన్ యుద్ధం సమయంలో భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానం, చమురు సంక్షోభం రాకుండా తీసుకుంటున్న చర్యలపై కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాలకు తెలియజేసింది. అయితే, ఈ కార్యక్రమంలో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారతదేశం "దళాల్ దేశం" కాదని స్పష్టం చేశారు. పాక్ మధ్యవర్తిత్వం గురించి ప్రతిపక్షాలు ప్రశ్నించిన తర్వాత, ఈ విమర్శలకు జైశంకర్ తనదైన శైలిలో చెక్ పెట్టారు. పాకిస్తాన్‌ను "బ్రోకర్ దేశం"గా అభివర్ణిస్తూ.. భారతదేశం ఎవరి మధ్య మధ్యవర్తిత్వం చేయదని చెప్పారు. భారత్ తన దేశ అవసరాలను మాత్రమే పట్టించుకుంటుందని ప్రభుత్వం సూటిగా చెప్పింది. ఇరాన్ యుద్ధాన్ని ఆపేందుకు ఇరాన్-యూఎస్ మధ్య పాకిస్తాన్ మధ్యవర్తిత్వం చేస్తుందనే వార్తల నేపథ్యంలో విదేశాంగ మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. పాక్ మధ్యవర్తిత్వం చేస్తుందనే వార్తలు వెలువడిన తర్వాత మోడీ సర్కార్‌పై కాంగ్రెస్‌తో సహా ఇతర ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేశాయి. జైరాం రమేష్ వంటి వారు పాక్ మధ్యవర్తిత్వం చేస్తుంది, ఇండియా ఆ పని కూడా చేయలేకపోతుందని ఎద్దేవా చేశారు. ఇటీవల పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ.. ఇరాన్ అమెరికా మధ్య చర్చలకు ఇస్లామాబాద్ సిద్ధంగా ఉందని వ్యాఖ్యానించారు. ఈరోజు జరిగిన ఆల్ పార్టీ మీటింగ్‌కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన వహించారు. ఇందులో హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి,విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రి పాల్గొన్నారు. ప్రతిపక్షాలైన బీజేడీ నుంచి సస్మిత్ పాత్రా, జేడీయూ నుంచి లల్లన్ సింగ్, కాంగ్రెస్ నాయకులు ముకుల్ వాస్నిక్, తారిఖ్ అన్వర్, సమాజ్‌వాదీ పార్టీ నుంచి ధర్మేంద్ర యాదవ్, సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ హాజరయ్యారు.

మంగళగిరిలో ఘనంగా రామాలయ పునఃప్రతిష్ఠ..

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణానికి తనవంతుగా రూ. 5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీ దేవి, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థం గిరిప్రదక్షిణ మార్గాన్ని వర్చువల్ గా ప్రారంభించిన డిప్యూటీ సీఎం..!

(మొదటి పేజీ తరువాయి)

కూడలి నుంచి నీలాచలం కొండ వరకు సుమారు 3.70 కిలోమీటర్ల మేర ఈ గిరిప్రదక్షిణ మార్గాన్ని నిర్మించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా రూ.3.40 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. శ్రీరామ నవమికి ముందే భక్తులకు ఈ మార్గాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. గతంలో రామతీర్థం గిరి ప్రదక్షిణ మార్గం రాళ్ళు, ముళ్లతో నిండిపోయి ఉండేది. అయినప్పటికీ భక్తులు ఎంతో కష్టపడి ప్రదక్షిణ చేసేవారు. ఈ సమస్యలను స్థానిక ప్రజలు, ఎమ్మెల్యే లోకం మాధవి దృష్టికి తీసుకురావడంతో ప్రభుత్వం స్పందించి, మార్గాన్ని సౌకర్యవంతంగా మార్చింది.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి, హిందూ ధర్మ పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటం తమ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. గత 20 నెలల్లో ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, ఇతర నిధుల ద్వారా రూ.40 కోట్లకు పైగా వెచ్చించి రాష్ట్ర వ్యాప్తంగా 22 ప్రధాన ఆలయాలకు రోడ్డు సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. ఇప్పటికే శ్రీకాళహస్తి ఆలయం గిరిప్రదక్షిణ మార్గాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చామని, అలాగే కోటప్పకొండ గిరిప్రదక్షిణ మార్గానికి రోడ్డు మంజూరు చేసినట్లు తెలిపారు.

పెట్రోల్ కొరత..

(మొదటి పేజీ తరువాయి)

మూడురోజులుగా పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులుతీరి కన్పిస్తున్నారు. గంటలకొద్దీ పడిగాపులు పడుతున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలు కిక్కిరిసి ఉంటున్నాయి. కొన్ని బంకులు నిరాటంకంగా పని చేస్తుంటే.. కొన్నిచోట్ల మాత్రం బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు కన్పిస్తున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం, చమురు, సహజ వాయువుల కొరత వార్తల నేపథ్యంలో ఈ నో స్టాక్ బోర్డులు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వాహనదారులు అవసరం ఉన్నా, లేకపోయినా డీజిల్, పెట్రోల్ ట్యాంక్ నిండా నింపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సాధారణంగా ఏరోజు కారోజు ఇంధనం నింపుకునే క్యాబ్ డ్రైవర్లు, ఇతర గిగ్ వర్కర్లు, సామాన్య ప్రజలు కూడా ఎంతో కొంత అదనంగా ట్యాంకు నింపుకోవాలని చూస్తుండటంతో తెరిచి ఉన్న బంకుల వద్ద క్యూలు పెరిగిపోతున్నాయి. కొందరు సీసాలు, పెద్దపెద్ద క్యాన్లు, డ్రమ్ముల్లో సైతం ఇంధనం నిల్వ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని బంకులు మూతపడి కన్పిస్తుండటంతో వాహనదారుల్లో ఆందోళన రెట్టింపవుతోంది. బంకులు మూత పడి ఉండటానికి 'నో క్రెడిట్' సమస్య ప్రధాన కారణమని తెలుస్తుండగా..ప్రభుత్వాలు, ఆయిల్ కంపెనీల ప్రకటనలను పట్టించుకోకుండా ప్రజలు ఎక్కడ పెట్రోల్, డీజిల్ దొరుకుతోందో తెలుసుకొని మరీ కొనుగోళ్లు చేస్తుండటంతో తెరిచి ఉన్న బంకులు కిక్కిరిసిపోయి కన్పిస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పశ్చిమాసియాలో యుద్ధం ఎప్పుడో మొదలైనా..సోమవారం సాయంత్రం నుంచే బంకుల వద్ద డీజిల్, పెట్రోల్ కోసం వాహనదారులు క్యూలు కట్టడం ప్రారంభించారు. ఆ ఫొటోలు టీవీలు, సోషల్ మీడియాలో ప్రసారం కావడంతో చమురు కొరతపై భయాందోళనలు మొదలయ్యాయి. బంకులన్నీ వాహనదారులతో నిండిపోవడం మొదలయ్యింది. మంగళ, బుధవారాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది.

ఇంధన కంపెనీల లెక్కల ప్రకారం రాష్ట్రంలోని సుమారు 3,600 పెట్రోల్ బంకులకు సాధారణంగా రోజుకు సగటున 13,752 కిలోలీటర్ల ఇంధనం అవసరం ఉంటుంది. తదనుగుణంగా ఆయిల్ కంపెనీలు సగటున 14,729 కిలోలీటర్లు సరఫరా చేసేవి. కానీ ప్రస్తుతం డిమాండ్ ఒక్కసారిగా 17,246 కిలోలీటర్లకు చేరింది. దీనికి అనుగుణంగా ఆయిల్ కంపెనీలు కూడా సరఫరాను 17,898 కిలోలీటర్లకు పెంచినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కానీ ఇప్పటికీ కొన్ని బంకులు నోస్టాక్ బోర్డులతో మూతపడి కన్పిస్తున్నాయి. మరికొన్ని బంకులు వాహనాలతో కిక్కిరిసి ఉంటున్నాయి. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో రెండు రోజుల్లో రెట్టింపు స్థాయిలో పెట్రోల్ విక్రయాలు పెరిగినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నెల 22న 3,024 కిలోలీటర్ల ఇంధనం విక్రయాలు జరగ్గా, 23న ఇది రెట్టింపై 6,400 కిలోలీటర్లకు చేరుకుంది.

ఏప్రిల్ మొదటి వారంలో 1.12 లక్షల ఇళ్లిస్తాం

హైదరాబాద్: పేదవాడి ఆత్మగౌరవానికి చిహ్నంగా భావించే సొంతింటి కలను పెద్ద ఎత్తున నిజం చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శాసనసభలో స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆయన హయాంలోనే అత్యధికంగా 21 లక్షల ఇళ్లు పేదలకు కట్టించారని తెలిపారు. తిరిగి తమ ప్రభుత్వమే ఈ స్థాయిలో ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తోందని చెప్పారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో కాటేపల్లి వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్ తదితరులు లేవనెత్తిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అంశం సుదీర్ఘ చర్చకు దారితీసింది. అధికార, విపక్ష సభ్యులు ఈ అంశంపై పలు ప్రశ్నలు వేశారు. వీటన్నింటికీ మంత్రి పొంగులేటి బదులిచ్చారు. పేదలకు ఇళ్లు ఇచ్చే కార్యక్రమాన్ని తాము ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామని చెప్పారు. 99 రోజుల ప్రణాళికలో దీనికే ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఏప్రిల్ మొదటి వారానికి 1.12 లక్షల ఇళ్లు అర్హులైన లబ్ధిదారులకు అందిస్తామన్నారు. వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణం, పంపిణీ పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2,31,206 ఇళ్లు మంజూరు చేశారని, వీటిల్లో 1,62,936 ఇళ్లు కొన్ని మౌలిక వసతులు మినహా పూర్తయినట్టు తెలిపారు. నాణ్యత విషయంలో వచ్చిన ఆరోపణలపై థర్డ్ పార్టీ విచారణ జరుగుతోందని, నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తున్నామని, దీనిద్వారా వచ్చే సందేహాలను వెంటనే నివృత్తి చేస్తామన్నారు.

లబ్ధిదారులు నివాసం ఉండడం లేదు

ఇళ్లు కేటాయించినా, చాలాచోట్ల లబ్ధిదారులు నివాసం ఉండడం లేదని మంత్రి తెలిపారు. అధికారులతో దీనిపై ఇటీవల సమీక్షించినట్లు చెప్పారు. దీనిపై 6,500 మందికి నోటీసులిస్తే, 4,500 మంది మాత్రమే స్పందించారని వెల్లడించారు. మరో రెండు నెలల్లో లబ్ధిదారులు ఇళ్లలోకి వెళ్లకపోతే, ఆ ఇళ్లను అర్హులైన ఇతరులకు కేటాయిస్తామన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే కేటాయించిన 12 వేల ఇళ్లలోకి లబ్ధిదారులు వెళ్లలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆగిపోయిన ఇళ్లను కూడా లబ్ధిదారులకు కేటాయిస్తామని, పాత కాంట్రాక్టర్లు పనులు చేయకపోతే ఇతరులకు అప్పగిస్తామని వెల్లడించారు.

కాంగ్రెస్‌కు జీవన్‌రెడ్డి గుడ్‌బై

జగిత్యాల: కాంగ్రెస్‌లో నాలుగు దశాబ్దాలపాటు ఉన్న మాజీమంత్రి జీవన్‌రెడ్డి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. బుధవారం జగిత్యాల జిల్లాకేంద్రంలోని బందారి గార్డెన్స్‌లో అభిమానులు, నాయకులు, కార్యకర్తల మధ్య రాజీనామా చేశారు. ఆ లేఖను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ తనదనే ధోరణిలో రేవంత్ మాట్లాడుతున్నారని, అడ్డొస్తే తొక్కుతా అంటున్నారని, ఎంతమందిని తొక్కుతారని ప్రశ్నించారు. ఏదో ఒకరోజు అందుకు ముగింపు తప్పదన్నారు. ఆ ముగింపు జగిత్యాల నుంచే ప్రారంభమవుతుందన్నారు. తాను ఎదగకుండా అణగదొక్కాలన్నదే రేవంత్‌రెడ్డి ఆలోచన అని, అయినప్పటికీ ఎదిరించి పోరాటం చేయడం తనకేం కొత్త కాదని తెలిపారు. కేసీఆర్, చంద్రబాబు వంటి వారితోనే పోరాటం చేశానని, ఇక నుంచి రేవంత్‌పైనే తన పోరాటమని వ్యాఖ్యానించారు. రేవంత్‌కు ఎదిరించే వారు వద్దని, రాహుల్‌గాంధీ ఆలోచనలకు అనుగుణంగా నడిచే వారిని అణగదొక్కుతున్నారని జీవన్‌రెడ్డి చెప్పారు. నేను 1984లో కాంగ్రెస్‌లో చేరిన. పార్టీతో నాకు 40 ఏళ్ల అనుబంధం ఉంది. అలాంటి అనుబంధాన్ని వదులుకోవాలని ఎవరూ కోరుకోరు. జరిగిన అవమానాలతో విధిలేని పరిస్థితుల్లో పార్టీని వీడుతున్నా. స్థానిక సంస్థల్లో ఒక సమయంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రాకపోతే ఒంటరిగా గెలిపించా. కాంగ్రెస్ కార్యకర్తలపై దౌర్జన్యం చేసిన వారికే మళ్లీ పార్టీలో స్థానం కల్పించారు. విధిలేని పరిస్థితుల్లో ఎమ్మెల్యేలను చేర్చుకున్నామని, మీ హక్కులకు భంగం కలగనివ్వబోమని కేసీ వేణుగోపాల్, మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హామీ ఇచ్చారు. అయినప్పటికీ మార్కెట్ కమిటీ చైర్మన్ల నియామకంలో జాప్యం చేశారు. దశాబ్దాలుగా అండగా నిలిచిన ఓ నాయకుడిని అతిదారుణంగా చంపితే సీఎం కనీసం మందలించలేదు. బీఆర్ఎస్ పాలనలో అరాచకం చేసిన పోలీసు యంత్రాంగాన్నే మళ్లీ తీసుకొచ్చారు. అసలు వేం నరేందర్‌రెడ్డి ఎవరు..? ఆయన పార్టీకి ఏం చేశారు..? చిన్నారెడ్డి వంటి సీనియర్ నాయకులకు జరిగిన అన్యాయానికి ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన దిశగా తీసుకొచ్చారు. సీనియర్లను గౌరవించడం లేదు. అణగదొక్కాలని ప్రయత్నిస్తున్నారు. వేం నరేందర్‌రెడ్డి ప్రభుత్వానికి ఏం సలహాలు ఇచ్చారో చెప్పాలి.

ఇరాన్‌కు అమెరికా 15 ప్రతిపాదనలు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా అణు, క్షిపణి కార్యకలాపాలను కట్టిపెట్టడం, హార్మూజ్‌పై పెత్తనాన్ని వదులుకోవడం, హెజ్బొల్లా వంటి సాయుధ గ్రూపులకు ఆర్థిక, ఆయుధ సాయం నిలిపివేత వంటి షరతులు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకారం కాదని కుండబద్దలు కొట్టింది. హార్మూజ్‌పై తన సార్వోభౌమాధికారాన్ని గుర్తించాల్సిందేనని డిమాండ్ చేసింది. "మాపై ఇంకెప్పుడూ యుద్ధానికి దిగరాదు. ఆర్థిక తదితర ఆంక్షలను పూర్తిగా ఎత్తేయాలి. మా నేతలు, సైనికాధికారుల హత్యలను మానుకోవాలి"అంటూ అమెరికాకు 8 షరతులు విధించింది! గల్ఫ్ నుంచి అమెరికా బలగాలన్నీ వైదొలగాలని కూడా స్పష్టం చేసింది. మరోవైపు ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర దాడులు బుధవారం కూడా తీవ్ర స్థాయిలో కొనసాగాయి. గల్ఫ్ దేశాలపై కూడా ఇరాన్ డ్రోన్ దాడులను కొనసాగించింది. అమెరికా కూడా మరో 5,000 మంది మెరైన్లు, 1,000 మంది సైనికులను గల్ఫ్ ప్రాంతానికి తరలిస్తోంది. ఈ నేపథ్యంలో ఇరు దేశాలను చర్చలకు ఒప్పించేందుకు పలు దేశాలు ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. అమెరికా కాల్పుల విరమణ ప్రతిపాదన పట్ల ఇజ్రాయెల్ విస్మయం వెలిబుచ్చింది. ఇరాన్ పూర్తిగా కాళ్లబేరానికి వచ్చేదాకా దాడులు కొనసాగించాలని అభిప్రాయపడింది. మరోవైపు పశ్చిమాసియాలో కాల్పుల విరమణ యత్నాలకు ఈజిప్టు, టర్కీ కూడా ముందుకొచ్చాయి. అమెరికా, ఇరాన్ నడుమ చర్చల దిశగా పలు దేశాలు ప్రయత్నాలు సాగిస్తున్నాయి. ఇరుదేశాలు అంగీకరిస్తే వాటి నడుమ ద్వైపాక్షిక చర్చలకు వేదికగా నిలిచేందుకు పాకిస్తాన్ సిద్ధమని ఆ దేశ ప్రధాని షహబాజ్ షరీఫ్ పునరుద్ఘాటించారు. కాల్పుల విరమణకు సంబంధించి అమెరికా తన 15 షరతులను పాక్ ద్వారానే ఇరాన్‌కు అందజేసినట్టు న్యూయార్క్ టైమ్స్ వార్తా సంస్థ పేర్కొంది. అయితే వాటిని పూర్తిగా తిరస్కరిస్తున్నట్టు ఇరాన్ ఉన్నతాధికారిని ఉటంకిస్తూ ఆ దేశ ప్రభుత్వ టీవీ చానల్ ప్రకటించింది. యుద్ధం ఎప్పుడు ముగియాలో నిర్ణయించాల్సింది ఇరానే తప్ప ట్రంప్ కాందంటూ మండిపడింది. అంతేగాక ఇరాన్ కూడా 8 షరతులతో కూడిన తమ ప్రతిపాదనలను వాటన్నింటికీ అంగీకరిస్తేనే యుద్ధానికి తెర దించడంపై నిర్ణయం తీసుకుంటామంటూ కుండబద్దలు కొట్టింది. అమెరికాతో నేరుగా చర్చలు జరగడం లేదని పునరుద్ఘాటించింది. గల్ఫ్, పరిసర దేశాల మంత్రులు తదితరులు తమతో మాట్లాడుతున్నట్టు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ చెప్పుకొచ్చారు. అమెరికాతో ప్రత్యక్ష చర్చలు మాత్రం అబద్ధమని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బఘెర్ ఖలీబాఫ్ అన్నారు. ట్రంప్ మాత్రం చర్చలు కొనసాగుతున్నాయని చెప్పుకొ చ్చారు.

తెలంగాణలో మరో కొత్త పార్టీ..

తెలంగాణ రాజకీయ యవనికపై మరో కీలక అంకం మొదలుకాబోతోంది. కల్వకుంట్ల కవిత మార్చి 27న కొత్త రాజకీయ పార్టీని స్థాపించబోతున్నట్లు సమాచారం. శ్రీరామనవమి పర్వదినాన ఉదయం 8 గంటలకు ఆమె తన రాజకీయ భవిష్యత్తుపై కీలక ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, కవిత తనకంటూ ఒక ప్రత్యేక రాజకీయ ముద్ర వేసుకోవాలని భావిస్తున్నారు. తెలంగాణ జాగృతి ద్వారా సాంస్కృతిక ఉద్యమాన్ని నడిపిన ఆమె, ఇప్పుడు నేరుగా కొత్త పార్టీ ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించుకోవడం వెనుక లోతైన రాజకీయ వ్యూహం ఉందనే చెప్పాలి. తన మెట్టినిల్లు నుంచే పార్టీ పేరు, జెండా, గుర్తు , విధివిధానాలను ప్రకటించనున్నట్లు సమాచారం. ఇది మహిళా ఓటర్లను.. స్థానిక సెంటిమెంటును ఆకట్టుకునే ప్రయత్నంగా భావించవచ్చు. మార్చి 27న ఆమె తాను పోటీ చేసే నియోజకవర్గాన్ని కూడా ప్రకటించనుండటంతో, ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లల్లో అలజడి మొదలైంది. తెలంగాణ సమాజంలో తనదైన శైలిలో గుర్తింపు తెచ్చుకున్న కవిత, ఈ కొత్త రాజకీయ ప్రయాణంలో ఎలాంటి సవాళ్లను ఎదుర్కోబోతున్నారో చూడాలి. ముఖ్యంగా తెలంగాణ సెంటిమెంట్ , అభివృద్ధి అంశాలను ఆమె కొత్త పార్టీ ఏ విధంగా ప్రజల్లోకి తీసుకెళ్తుందనేది ఆసక్తికరంగా మారింది.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

- యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తోర్పునూరి శ్రీకాంత్ గౌడ్

నల్లగొండ/చౌటుప్పల్, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): యువజన కాంగ్రెస్ నాయకులు మరింత చురుగ్గా పనిచేసి, గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు, రాష్ట్ర విత్ఐవైసీ యాప్ కమిటీ మెంబర్ తోర్పునూరి శ్రీకాంత్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా యువజన కాంగ్రెస్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా ఉపాధ్యక్షులు తోర్పునూరి శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి యువతే వెన్నెముక అని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన పార్టీ యువ నాయకులను చూసి గర్విస్తున్నామని, వారి స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. విత్ఐవైసీ యాప్ ద్వారా పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని, సాంకేతికతను వాడుకుంటూ ప్రజల్లోకి వెళ్లాలని శ్రీకాంత్ గౌడ్ సూచించారు.

జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

- వదంతులను నమ్మవద్దుడ అవసరానికి మించి నిల్వలు చేయొద్దు
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ, మార్చి 25 (తొలివెలుగు న్యూస్) : జిల్లాలో ఎక్కడా పెట్రోల్, డీజిల్ కొరత లేదని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ స్పష్టం చేశారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న అసత్య వదంతుల కారణంగా ప్రజలు అనవసర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఈ వదంతుల ప్రభావంతో ప్రజలు ఒకేసారి పెద్ద సంఖ్యలో పెట్రోల్ బంకులకు వెళ్లి ఇంధనం నింపించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అయితే జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా నిరంతరంగా కొనసాగుతున్నదని స్పష్టం చేశారు. ఎటువంటి కొరత పరిస్థితి లేదని, ప్రజలు అవసరానికి మించి ఇంధనం నిల్వ చేసుకోవద్దని ఎస్పీ సూచించారు. అలా చేయడం వల్ల ఇతరులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండడంతో పాటు అనవసర గందరగోళం నెలకొనే ప్రమాదం ఉందన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న నిర్ధారించని సమాచారాన్ని నమ్మవద్దని, అలాంటి వదంతులను ఇతరులకు పంపించడం ద్వారా వ్యాప్తి చేయకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ప్రజలు తమ సాధారణ అవసరాల మేరకే ఇంధనం వినియోగించుకోవాలని, ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉన్నారని, వదంతులు వ్యాప్తి చేయడం లేదా ప్రజల్లో భయం కలిగించే చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

విద్యార్థుల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యం

- మైనారిటీ గురుకులంలో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

- పిల్లలతో కలిసి భోజనం చేసిన డాక్టర్ మనోహర్

యాదాద్రిభువనగిరి, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): విద్యార్థులు విద్యతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. మనోహర్ పేర్కొన్నారు. బుధవారం భువనగిరి పట్టణ శివారులోని తెలంగాణ మైనారిటీ నివాస పాఠశాల, జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, స్టోర్ రూమ్, తరగతి గదులను పరిశీలించి, ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, భోజన నాణ్యతపై ఆరా తీశారు. పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకావద్దని, భయం వేస్తే 'టెలి మానస్' సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, వైద్య సిబ్బందికి సహకరించాలని గురుకుల సిబ్బందిని ఆదేశించారు. పౌష్టికాహారంతో పాటు ఆరోగ్య విద్యా బోధన కూడా అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ యాకయ్య, వార్డెన్ మాజాయిద్దీన్, పల్లె దవాఖాన వైద్యుడు డాక్టర్ మురళీమోహన్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో 'ఫార్మ్' మాయాజాలం..

పచ్చని చెట్ల మాటున పక్కా స్కామ్!

- ఫార్మ్ ల్యాండ్ పేరిట కొత్త మోసం
- అనుమతుల్లేకుండానే వెంచర్ల ఏర్పాటు
- గుంటల చొప్పున వ్యవసాయ భూముల అమ్మకాలు
- కొనుగోలుదారులకు భారీ లాభాల ఎర
- నిబంధనలను బేఖాతరు చేస్తున్న వ్యాపారులు
- ప్రభుత్వ యంత్రాంగంపై అనుమానాలు



చౌటుప్పల్, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న చౌటుప్పల్ మండలం ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారుల 'మాయా లోకం'గా మారుతోంది. "నగరపు హడావుడి నుంచి దూరంగా పచ్చని ప్రకృతి ఒడిలో మీకో ఫార్మ్ హౌస్" అంటూ ఆకర్షణీయ ప్రకటనలతో అమాయక పెట్టుబడిదారులను ఆకట్టుకుంటున్న రియల్టర్లు, 'ఫార్మ్ ల్యాండ్' పేరిట నిబంధనలకు విరుద్ధంగా దందా సాగిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలోని దేవలమ్మ నాగారం, పీపల్ పహాడ్ గ్రామాల్లో ఈ తరహా అక్రమ వెంచర్లు విస్తరిస్తున్నాయి.

అధిక వర్గాలే టార్గెట్:

ఈ దందాలో ప్రధానంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, వైద్యులు, రిటైర్డ్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని వ్యాపారులు వల వేస్తున్నారు. "ఐదు గుంటల ప్లాట్ కొంటే, అందులో శ్రీగంధం మొక్కలు నాటుతాండ పదేళ్లలో కోట్ల విలువ వస్తుంది" అంటూ భారీ లాభాల ఎర వేస్తున్నారు. పచ్చని చెట్ల మధ్య ప్లాట్లను చూపిస్తూ, భవిష్యత్తు లాభాలపై నమ్మకం కలిగించి ఒక్కో ప్లాట్‌ను రూ. 20 లక్షల నుంచి రూ. 40 లక్షల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

> **భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు:**
> ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు జరుగుతున్నప్పటికీ, భవిష్యత్తులో ప్రభుత్వం అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకుంటే ప్లాట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) జరగకపోవచ్చు. అలాగే కొనుగోలు చేసిన భూములను తిరిగి అమ్ముకోవడం కష్టమవడం, అనుమతులు లేకుండా నిర్మించిన నిర్మాణాలు కూల్చివేతకు గురయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నిబంధనలకు తూట్లు:

తెలంగాణ మునిసిపల్ చట్టం-2019, పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం వ్యవసాయ భూమిని ప్లాట్లుగా విక్రయించాలంటే కనీసం 20 గుంటల విస్తీర్ణం ఉండాలి. అయితే ఇక్కడ ఐదు గుంటలకే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా అగ్రికల్చర్ ల్యాండ్‌గా కొనుగోలు చేసిన ఈ ప్లాట్లలో భవిష్యత్తులో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు రావని అధికారులు చెబుతున్నారు. సాధారణ వెంచర్లలో ఉండాల్సిన రహదారులు, పార్కుల వంటి సదుపాయాల కోసం స్థలం కేటాయించకుండా ఇంచీ ఇంచీగా భూమిని అమ్మేస్తున్నారు.

రైతు భరోసా దుర్వినియోగం:

ఈ ఫార్మ్ వెంచర్లలో భూములను నాన్ అగ్రికల్చర్ (నాల) కింద మార్పిడి చేయకపోవడంతో రికార్డుల్లో ఇవి ఇంకా వ్యవసాయ భూములుగానే కొనసాగుతున్నాయి. ఫలితంగా కన్వర్షన్ ఫీజులు తప్పించుకోవడంతో పాటు, కొన్నివేళ్లలో రైతు కాని వ్యక్తుల పేర్లపైనా 'రైతు భరోసా' నిధులు జమవుతున్నట్లు తెలుస్తోంది. ఇది ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి దారితీస్తోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిపుల సూచన:

అనుమతులు లేని ఫార్మ్ ప్లాట్లలో పెట్టుబడి పెట్టడం అంటే డబ్బును ప్రమాదంలో పెట్టడమే. తాత్కాలిక లాభాల ఆశతో ముందుకెళ్తే భవిష్యత్తులో చట్టపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంది. చౌటుప్పల్ మండలంలో పుట్టగొడుగుల్లా పెరుగుతున్న ఈ అక్రమ ఫార్మ్ వెంచర్ల వెనుక రాజకీయ, అధికార మద్దతు ఉన్నట్టు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు, రిజిస్ట్రేషన్ శాఖ వెంటనే స్పందించి ఈ దందాపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా 'కార్తికేయ బీజేఆర్' గార్డెన్స్ ప్రారంభోత్సవం



సంస్థాన్ నారాయణపురం, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ గ్రామంలోని మల్లారెడ్డిగూడెం రోడ్డులో నిర్మితమైన 'కార్తికేయ (బీజేఆర్) గార్డెన్' ఫంక్షన్ హాల్‌ను బుధవారం ఘనంగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ చిలకరాజు చందన రాజు రిబ్బన్ కట్ చేసి ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫంక్షన్ హాల్ యజమాని బొబ్బల జితేందర్ రెడ్డి సంధ్య దంపతులు, వారి కుమారులు సాత్విక్ రెడ్డి, రిత్విక్ రెడ్డి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ గణపతి పూజ, వాస్తు పూజ, చండీయాగం, హోమం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కళ్యాణ మండపాన్ని సంస్థాన్ నారాయణపురం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, డైనింగ్ హాల్‌ను యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అర్థ వెంకటరెడ్డి, కార్యాలయాన్ని మద్ది సత్యనారాయణ రెడ్డి ప్రారంభించారు. వరుడు గదిని కాంగ్రెస్ నాయకులు దోనూరు జయపాల్ రెడ్డి, వధువు గదిని సర్వేల్ ఉపసర్పంచ్ కట్కూరి భాస్కర్ గౌడ్, బీఆర్ఎస్ గ్రామ కార్యదర్శి నలపరాజు పద్మ స్వామి ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్య అతిథులు యజమాని జితేందర్ రెడ్డి సంధ్య దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అతిథులందరిని యజమానులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఫంక్షన్ హాల్ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మధ్యతరగతి కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని అందుబాటు ధరల్లో అన్ని సౌకర్యాలతో ఈ హాల్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వివాహాలు, నిశ్చితార్థాలు, పుట్టినరోజులు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర శుభకార్యాలకు తక్కువ ఖర్చుతో సేవలు అందించడం లక్ష్యమని తెలిపారు. ఫంక్షన్ హాల్ బుకింగ్ కోసం 9701682565 నంబర్‌ను సంప్రదించాలని యాజమాన్యం సూచించింది. కార్యక్రమంలో సర్వేల్ గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, నారాయణపురం మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పత్రికా విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

చిన్న మేడారం జాతర నిందితులకు రిమాండ్

- తొమ్మిది వారాల విచారణ తర్వాత అరెస్టులు.. 10 మందికి జైలు శిక్ష

రాజపేట, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): మండలంలోని కుర్రారం గ్రామంలో జరిగిన చిన్న మేడారం జాతరలో దాడికి పాల్పడిన ముద్దాయిలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రాజపేట ఎస్ఐ లింగారెడ్డి బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారండ జనవరి నెలలో మెగా రోహిత్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి చిన్న మేడారం జాతరకు హాజరయ్యాడు. ఈ సందర్భంగా అక్కడ కొంతమంది యువకులు రోహిత్, అతని కుటుంబ సభ్యులతో గొడవకు దిగడంతో పాటు దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అనంతరం బాధితుల మెడికల్ సర్టిఫికేట్ ఆధారంగా పాముకుంట, బొందుగుల గ్రామాలకు చెందిన రంగా చందు, బొచ్చు సాయి, బత్తిని వర్షిత్, అంబాల సాయి, అనుప పరుశరాములు, ఉప్పరి అజయ్, బోయిని పవన్, పంతం నవీన్, చీర బాలకృష్ణ, దువ్వాల అజయ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ముద్దాయిలను కోర్టు ముందు హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు. దీంతో వారిని భువనగిరి సబ్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ లింగారెడ్డి తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయంలో సీఈఓ ఆకస్మిక తనిఖీ

- రికార్డుల నిర్వహణపై అసహనం: ఉపాధి పనులపై ఆరా

యాదగిరిగుట్ట, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): యాదగిరిగుట్ట మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని పంచాయతీరాజ్ శాఖ సీఈఓ శోభారాణి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను సందర్శించిన ఆమె, ముఖ్యంగా రికార్డుల నిర్వహణను నిశితంగా పరిశీలించారు. ఏడు రకల ప్రధాన రికార్డులను (07 రికార్డులు) తనిఖీ చేసి, వాటి నమోదులో జరుగుతున్న జాప్యంపై అధికారులను ప్రశ్నించారు. అనంతరం మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల పురోగతిపై ఆమె ఆరా తీశారు. వేసవి దృష్ట్యా కూలీలకు ఇబ్బంది కలగకుండా వసతులు కల్పించాలని, పనుల నాణ్యతలో రాజీ పడకూడదని ఆదేశించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రాజాపేట తైబజారు వేలంపాట

ఉదయం 11 గంటలకు గాంధీ విగ్రహం వద్ద నిర్వహణ

రాజపేట, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): రాజపేట మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే సంత తైబజారు వేలంపాట ఈ నెల 26వ తేదీ గురువారం జరగనున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి సాయిలు తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం కూడలి వద్ద ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు ఉదయం 10 గంటలలోపు రూ.10,000 డిపాజిట్ చెల్లించాలని సూచించారు. పంచాయతీ నిర్దేశించిన నిబంధనలకు లోబడి వసూళ్ల నిర్వహణ జరగనుందని తెలిపారు. సర్పంచ్ కోయ మధు అధ్యక్షతన, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో వేలంపాట జరుగుతుందని పేర్కొన్నారు. వేలంపాటలో హక్కులు దక్కించుకున్న వారికి ఒక సంవత్సరం పాటు సంత నిర్వహణ హక్కులు ఉంటాయని కార్యదర్శి వివరించారు.

మీ ఊరికే వచ్చి 'కుట్టు' నేర్పిస్తాం!

– మహిళల అభ్యున్నతికి శ్రీ శక్తి ఇన్‌స్టిట్యూట్ చేయూత

రాజపేట, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయని శ్రీ శక్తి ఇన్‌స్టిట్యూట్ ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం నిర్వాహకులు పేర్కొన్నారు. బుధవారం రాజపేటలోని మహిళా సమాఖ్య భవనంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత, మహిళలకు చేతివృత్తిలో శిక్షణ ఇచ్చి వారి కాళ్లపై వారు నిలబడేలా చేయడమే తమ సంస్థ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

గ్రామాలకే వచ్చి శిక్షణ:

కేవలం పట్టణాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంత మహిళల కోసం ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వారు వెల్లడించారు. ఏదైనా గ్రామంలో 15 నుండి 30 మంది మహిళలు శిక్షణ కోసం ఆసక్తి చూపితే, తమ సంస్థ తరఫున ఉపాధ్యాయులను నేరుగా ఆ గ్రామానికే పంపి శిక్షణ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. "ఆకలితో ఉన్నవారికి ఒక పూట అన్నం పెట్టడం కంటే, వారికి ఒక విద్యను నేర్పిస్తే అది వారి జీవితకాలం అన్నం పెడుతుంది" అనే ఆశయంతో ఈ సేవలు అందిస్తున్నట్లు నవనీత నరేందర్ తెలిపారు. ఆసక్తి గలవారు 9014514780, 9701679824 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రాజాపేట సర్పంచ్ కోయ మధు, ఉపసర్పంచ్ నెమల కేదారి, దాచేపల్లి రాజు, నెమల మహేందర్ గౌడ్, గుర్రం నరసింహులు, పాండవుల బసవయ్య, భరత్, మహేష్, నాని, రేగు సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల చెల్లింపులో పాలకవర్గం ఆదర్శం

- ముందుగా ఇంటి పన్నులు చెల్లించిన సర్పంచ్, వార్డు సభ్యులు

- రాజపేటను జిల్లాలోనే మేటిగా నిలుపుదాం: సర్పంచ్ కోయ మధు

రాజపేట, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): గ్రామాభివృద్ధిలో పన్నుల చెల్లింపు కీలకమని, ఆ బాధ్యతను తామే ముందుండి నెరవేరుస్తున్నామని రాజపేట గ్రామపంచాయతీ పాలకవర్గం చాటిచెప్పింది. బుధవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కోయ మధు, ఉపసర్పంచ్ నమిల కేదారి గౌడ్ మరియు వార్డు సభ్యులు తమ వ్యక్తిగత ఇంటి పన్నులను నూటికి నూరు శాతం చెల్లించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్ను మొత్తాన్ని పంచాయతీ కార్యదర్శి సాయిలుకు అందజేసి, రసీదులు అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యం మెరుగుపడాలంటే ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలని కోరారు. ప్రజాప్రతినిధులుగా తాము ముందుగా చెల్లిస్తేనే ప్రజలకు చెప్పే హక్కు ఉంటుందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలోనే రాజపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేస్తున్నామని, గ్రామస్తులందరూ తమ బకాయిలను వెంటనే చెల్లించి గ్రామ ప్రగతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పోచంపల్లిని అంతర్జాతీయ పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతాం

- మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రణాళికలు

- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ బృందంతో కలెక్టర్ పర్యటన

భూదాన్ పోచంపల్లి, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): పోచంపల్లిని పూర్తి స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. బుధవారం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయూఎం) బృందంతో కలిసి ఆయన పోచంపల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా టూరిజం పార్కులోని చేనేత మ్యూజియం, చేనేత కార్మికుల గృహాలను సందర్శించిన కలెక్టర్, చేనేత తయారీ విధానాన్ని కార్మికులను అడిగి తెలుసుకున్నారు. పర్యాటక అభివృద్ధి కోసం ఇప్పటికే ఏర్పాటు చేసిన సదుపాయాలపై టూరిజం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం వినోబా మందిరాన్ని సందర్శించి ఆచార్య వినోబా భావే, వెదిరే రామచంద్రారెడ్డి కాంస విగ్రహాలకు పూలమాలలు అర్పించారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర అధ్యక్షుడు గున్న రాజేందర్ రెడ్డి వద్ద భూదాన్ ఉద్యమానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. గ్రామంలో ప్రతిపాదిత మినీ ట్యాంక్ బండ్ నిర్మాణంపై మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లుతో చర్చించారు. అనంతరం మార్కండేయ స్వామి దేవాలయం, అయ్యప్ప స్వామి దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి జలాల్‌పూర్‌లోని ఎస్ఆర్టీఆర్ఐ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, గ్రామీణ యువతకు అందిస్తున్న ఉపాధి, శిక్షణ కార్యక్రమాలపై చైర్మన్ కిషోర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత వృత్తి ద్వారా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పోచంపల్లి ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక వసతులపై సమగ్రంగా అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతాన్ని రాష్ట్రంలో ప్రత్యేక స్థానంలో నిలబెట్టేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా చేనేత శాఖ ఏడి శ్రీనివాస్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి నాగిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో భాస్కర్, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ఏపీఎం తవార్య నాయక్, చేనేత నాయకులు భారత లవ కుమార్, కర్నాటి బాలరాజు, అంకం పాండు తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ యాక్షన్ ప్లాన్ దరఖాస్తు గడువు ఏప్రిల్ 2 వరకు పొడిగింపు

- సద్వినియోగం చేసుకోవాలన్న ఎంపీడీవో నాగవేణి

రాజపేట, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన 'ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26' దరఖాస్తు గడువును పొడిగించినట్లు ఎంపీడీవో నాగవేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎస్సీ నిరుద్యోగులకు కేటాయించిన 11 యూనిట్ల మంజూరు కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఈనెల 24తో గడువు ముగియాల్సి ఉండగా, దరఖాస్తుదారుల అభ్యర్థన మేరకు ఏప్రిల్ 2వ తేదీ వరకు సమయాన్ని పెంచినట్లు పేర్కొన్నారు. అర్హులైన యువతీ యువకులు ముందుగా ఆన్‌లైన్ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత ఆ దరఖాస్తు పత్రాల హార్డ్ కాపీ (ప్రింటెడ్ కాపీ)తో పాటు అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా వివిధ యూనిట్ల కోసం 80 దరఖాస్తులు అందాయని వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ రాయితీ పథకాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు.

యాద్రిశుని సేవలో ఆర్యవైశ్య సంఘం నేతలు

- వైభవంగా వేద ఆశీర్వచనం.. తీర్థప్రసాదాల వితరణ

రాజపేట, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని రాజపేట మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి ఉప్పల సిద్ధిలింగం బుధవారం దర్శించుకున్నారు. రఘునాథపురం పట్టణ అధ్యక్షుని హోదాలో ఆయనతో పాటు జిల్లా నాయకులు ఉప్పల రమేష్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రానికి చేరుకున్న వీరికి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ముందుగా స్వామివారిని దర్శించుకున్న నేతలు, తమ గోత్రనామాలతో అర్చనలు చేయించుకున్నారు. అనంతరం క్షేత్రంలోని ఆశీర్వచనం మండపంలో ఉప ప్రధానార్చకులు వారికి వేద మంత్రోచ్ఛారణల మధ్య ఆశీర్వచనం గావించారు. స్వామివారి శేషవస్త్రంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. లోకకళ్యాణం కోసం, మండల ప్రజల ఆయురారోగ్యాల కోసం తాము స్వామివారిని వేడుకున్నట్లు ఈ సందర్భంగా నేతలు తెలిపారు.

బీఆర్ఎస్ లోకి భారీగా చేరికలు

గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన గొంగిడి మహేందర్ రెడ్డి

రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే: డీసీసీబీ మాజీ చైర్మన్ ధీమా

యాదగిరిగుట్ట, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): యాదగిరిగుట్ట పట్టణంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. బుధవారం పట్టణంలోని 2వ వార్డుకు చెందిన సీనియర్ నాయకుడు మోతే నరసింహ నేతృత్వంలో వివిధ పార్టీలకు చెందిన సుమారు వంద మంది కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రగతి ప్రదాత కేసీఆర్ నాయకత్వంపై నమ్మకంతోనే ఇతర పార్టీల వారు బీఆర్ఎస్ వైపు వస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన అసాధ్యమైన హామీలను నమ్మి ప్రజలు మోసపోయారని, ఆ పార్టీకి పాలన చేసే దమ్ము లేదని విమర్శించారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం ఉంటుందని, రాబోయే రోజుల్లో కేసీఆర్ సర్కార్ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి పాపట్ల నరహరి, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ముక్కెర్ల సతీష్ యాదవ్, నాయకులు బాలయ్య గౌడ్, రాజేష్ యాదవ్, నర్సింగం పురుషోత్తం, మోతే బాలు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి లక్ష్మీనరసింహస్వామి సేవలో సీఈఓ శోభారాణి

- వైభవంగా ఆశీర్వచనం.. తీర్థప్రసాదాల వితరణ

యాదగిరిగుట్ట, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని పంచాయతీరాజ్ శాఖ సీఈఓ శోభారాణి బుధవారం దర్శించుకున్నారు. క్షేత్రానికి చేరుకున్న ఆమెకు ఆలయ అర్చకులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె గర్భాలయంలోని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆమె పేరిట గోత్రనామార్చనలు గావించారు. దర్శనానంతరం క్షేత్రంలోని ఆశీర్వచన మండపంలో అర్చకులు ఆమెకు వేదమంత్రోచ్ఛారణల మధ్య వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఏఈఓలు రఘు, చంద్రమౌళి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు తాండూర్ వెంకటాచార్యులు, నరేష్ కుమార్ ఆచార్యులు, శ్రీధర్ ఆచార్యులు, ఆలయ అధికారులు ఏఈఓ రఘు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేటలో పెన్షనర్ల 'బ్లాక్ డే' నిరసన

రామన్నపేట, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): రామన్నపేట మండల ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్లు 'బ్లాక్ డే'గా నిరసన కార్యక్రమం నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వాలిడేషన్ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. పెన్షనర్ల అభిప్రాయం ప్రకారం, 2025 మార్చి 25 తేదీ ప్రభుత్వ పింఛన్ దారులందరికీ దుర్దినంగా నిలిచిందని తెలిపారు. భారత పార్లమెంట్‌లో ఆమోదించిన వాలిడేషన్ చట్టం ప్రకారం, 01-01-2026కు ముందు పదవి విరమణ పొందిన వారిని, ఆ తర్వాత రిటైర్ అయిన వారిని వేర్వేరు వర్గాలుగా విభజించి, రాబోయే వేతన సవరణల ప్రయోజనాలను 2026 తర్వాత రిటైర్ అయిన వారికి మాత్రమే పరిమితం చేసే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని, అలాగే దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు వ్యతిరేకమని పేర్కొన్నారు. పెన్షనర్ల సంక్షేమానికి హానికరంగా మారే ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మండల సూపరింటెండెంట్ గాలయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో టి. సూర్యనారాయణ, గోదాసు అంజయ్య, గంగుల రామ్ రెడ్డి, గోవర్ధన చారి, బొడ్డు వెంకటేశం, తవుటం భిక్షపతి, మన్సూర్ అలీ, శంశీర్ భేగ్, ముత్తినేని మల్లేశం, కాచం వెంకటయ్య, వనం అంజయ్య, భాస్కర చారి, వెంకటయ్య, శంకరయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

వెల్లంకి సర్కారీ బడి.. గురుకులాల 'గురి'!

- 10 మంది విద్యార్థులకు పరీక్ష.. అందరికీ సీట్లు కేటాయింపు
- విజేతలను అభినందించిన సర్పంచ్, విద్యా కమిటీ

రామన్నపేట, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని వెల్లంకి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నిరూపించారు. తెలంగాణ గురుకుల సెట్-2026 ఫలితాల్లో ఈ పాఠశాల అద్భుత ప్రతిభ కనబరిచింది. ఐదో తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షకు ఈ బడి నుంచి పది మంది విద్యార్థులు హాజరుకాగా, మొదటి విడతలోనే పదికి పది మంది వివిధ గురుకులాల్లో సీట్లు సాధించి రికార్డు సృష్టించారు. 100 శాతం ఫలితాలతో వెల్లంకి పాఠశాల జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని ప్రధానోపాధ్యాయులు పల్లె మోహన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. గతేడాది నుంచి నాలుగో తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తున్న విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్, కో-ఆర్డినేటర్ సతీష్ సేవలను గ్రామ సర్పంచ్ ఇడెం రాధ శ్రీనివాస్, పాఠశాల కమిటీ ఛైర్‌పర్సన్ పులగం సులోచన కొనియాడారు. ఉపాధ్యాయులు సోమిరెడ్డి, బిక్షమయ్య, సువర్ణ, వెంకటయ్య, మాధవి, విద్యా వాలంటీర్లు అశ్విని, రాజేశ్వరిల శ్రమకు ఈ ఫలితం దక్కిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేదరికం ఉన్నా.. నిజాయితీ మెండు!

- దొరికిన వెండి పట్టీలను బాధితులకు అందజేసిన పంచాయతీ సిబ్బంది
- వేములకొండలో బాధితులకు అందజేత.. గ్రామస్తుల ప్రశంసలు

వలిగొండ, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): విధి నిర్వహణలో వారు పారిశుధ్య కార్మికులే కావచ్చు.. కానీ వారు చూపిన నిజాయితీ మాత్రం ఎందరికో ఆదర్శంగా నిలిచింది. వలిగొండ మండలంలోని వేములకొండ గ్రామ పంచాయతీ సిబ్బంది బుధవారం తమ నిజాయితీని చాటుకున్నారు. గ్రామంలోని వీధుల్లో ప్రతిరోజూ లాగే పారిశుధ్య పనులు నిర్వహిస్తుండగా, వీరికి పది తులాల బరువున్న వెండి పట్టీలు లభించాయి. అవి ఎవరివో తెలుసుకునే ప్రయత్నంలో ఉండగా, అదే గ్రామానికి చెందిన బత్తుల నరసింహ, ఇట్టెలమ్మ దంపతులు తమ పట్టీలు పోయాయని ఆవేదన చెందుతూ కనిపించారు. వెంటనే స్పందించిన పంచాయతీ సిబ్బంది, ఆ పట్టీలు వారివేనని గుర్తించి భద్రంగా దంపతులకు అందజేశారు. కష్టపడి పనిచేసే కార్మికులు ఇంతటి నిజాయితీని ప్రదర్శించడం పట్ల సర్పంచ్, పాలకవర్గం మరియు గ్రామస్తులు వారిని అభినందించారు. పోగొట్టుకున్న వస్తువు తిరిగి దొరకడంతో బాధిత దంపతులు కార్మికులకు చేతులెత్తి మొక్కుతూ కృతజ్ఞతలు తెలిపారు.

విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- రామన్నపేటలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు
- గర్భిణులతో ముచ్చటించిన భాస్కర్ రావు.. వైద్య సేవలపై ఆరా
- వైద్య సేవలు, పారిశుధ్యంపై క్లాస్.. శానిటేషన్ ఏజెన్సీకి షోకాజ్ నోటీసులు
- నర్సరీలో మొక్కల పెంపకాన్ని పరిశీలించిన భాస్కర్ రావు
- నెలాఖరులోగా పన్నుల వసూళ్లు పూర్తిచేయాలని ఆదేశం

రామన్నపేట, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): విధుల పట్ల అలసత్వం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు హెచ్చరించారు. బుధవారం రామన్నపేట మండల కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, డాక్టర్లు, సిబ్బంది హాజరు, విధుల నిర్వహణపై రిజిస్టర్లను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ, ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించి, రోజువారీ రోగుల సంఖ్యపై వివరాలు తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ ఆసుపత్రి ప్రాంగణంలో తిరుగుతూ రోగులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. గర్భిణీ స్త్రీలను ప్రత్యేకంగా సంప్రదించి, వైద్యులు సమయానికి చికిత్స అందిస్తున్నారా, పరీక్షలు ఆసుపత్రిలోనే జరుగుతున్నాయా అని విచారించారు. ఆసుపత్రి పరిసరాలను ప్రతిరోజు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శానిటేషన్ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. అనంతరం రామన్నపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామాల వారీగా పన్నుల వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు వసూలైన పన్నులు, మిగిలిన బకాయిలపై అధికారులను ప్రశ్నించి, ఈ నెలాఖరులోగా 100 శాతం వసూళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. తదనంతరం రామన్నపేట నర్సరీని సందర్శించి మొక్కల పెంపకం, సంరక్షణను పరిశీలించారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటి, వాటిని క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించాలని సూచించారు. గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో మొక్కల పెంపకం కీలకమని, ప్రతి ఒక్కరూ చెట్లను నాటి వాటిని కాపాడాల్సిన బాధ్యత ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎండీఓ రాములు, ఎంపీవో రవూఫ్ అలీ, ఏపీవో వెంకన్న, బిల్ కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కక్కిరేణి 'బడి' బాట.. ప్రైవేటుకు దీటుగా వార్షిక వేడుకలు

- కక్కిరేణి పాఠశాల వార్షికోత్సవంలో ఎంఈఓ గవ్వ జ్యోతి
- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

రామన్నపేట, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): "మన ఊరి బడిని మనమే కాపాడుకుందాం.. ఉన్న బడిని ఉన్నతంగా తీర్చిదిద్దుదాం" అనే నినాదంతో కక్కిరేణి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం బుధవారం కనులపండువగా జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ఉపేందర్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు ఎంఈఓ గవ్వ జ్యోతి, కాంప్లెక్స్ హెచ్ఎం దొడ్డి స్వామి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఈ పాఠశాల నుంచి పది మంది విద్యార్థులు గురుకులాలకు ఎంపిక కావడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా దాతల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేయడం గర్వకారణమని అతిథులు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులు కన్నెబోయిన లిఖిత, అంకిరెడ్డి జస్విక, వేముల అక్షతలు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు సభికులను మంత్రముగ్ధులను చేశాయి. జానపద గేయాలకు విద్యార్థులు వేసిన స్టెప్పులు అలరించాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జిల్లా మధురవేణి సురేష్, హెచ్ఎం హనుమంతరావు, ఏఏపీసీ ఛైర్మన్ చిల్ల ప్రేమలత, సామాజిక కార్యకర్త వేముల సైదులు తదితరులు పాల్గొన్నారు. చివరగా దాతలను, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.



ఘనంగా పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం

- ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): రామన్నపేట మండల కేంద్రంలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో లక్ష్మాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు ఉప్పాగుల కిరణ్ కుమార్ గౌడ్ కుమార్తె నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుక బుధవారం కనులపండువగా జరిగింది. ఈ శుభకార్యానికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేడుకలో పాల్గొన్న ఆయన చిన్నారులను దీవించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, లక్ష్మాపురం సర్పంచ్ పులిపలుపుల సునీత వీరస్వామి, జిల్లా నాయకుడు బద్దుల రమేష్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండి అమీర్, యువజన విభాగం మండల అధ్యక్షుడు బత్తుల వెంకన్న, ఉపసర్పంచ్ నీల నరసింహ, చొప్పరి నరసింహ, నల్ల సైదులు, మారగోని యాదయ్య, బజ్జూరి నరసింహ, బద్దం గోపాల్, నాలిక నరసింహ, కోయగూరి గణేష్, జోగు సత్యనారాయణ, పొట్ట కృష్ణ, బత్తిని నాగరాజు, ఉప్పాగుల అశోక్, తరుణ్, బొడ్డు శ్రీకాంత్, చిత్రకంటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన ఊరిపై 'పోలీస్' మమకారం!

- మునిపంపుల పంచాయతీకి సీఐ చిన్న నర్సింహా వీధి దీపాల బహూకరణ
- సొంత ఊరి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి: సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం

రామన్నపేట, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): సొంత ఊరి రుణం తీర్చుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం కోరారు. గ్రామానికి చెందిన నల్లగొండ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (సీఐ) గంటెపాక చిన్న నర్సింహా తన సొంత ఖర్చులతో రూ. 18,000 విలువైన ఎల్ఈడీ (ఎల్ఈడీ) వీధి దీపాలను గ్రామ పంచాయతీకి విరాళంగా అందజేశారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గం సమక్షంలో ఈ దీపాలను స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఉన్నత పదవుల్లో ఉన్నవారు తమ పుట్టిన ఊరి అభివృద్ధిని విస్మరించకుండా ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. గ్రామంలో చీకట్లు తొలగించేందుకు సీఐ చేసిన సహాయం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఇదే బాటలో గ్రామానికి చెందిన ఇతర ఉద్యోగులు, ప్రముఖులు కూడా మునిపంపుల ప్రగతికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాళ్ళ క్రాంతి కుమార్, వార్డు సభ్యులు మేకల రాములు, గంటెపాక శ్రీను, గ్రామస్తులు మామిండ్ల కుమార్, ఆకుల శేఖర్, మామిండ్ల నర్సింహా, సిరిసాల కళ్యాణ్, గంగాదారి నవీన్, ఎండీ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ ఉద్రిక్తతల ప్రభావం

రూపాయి, ద్రవ్యోల్బణ దెబ్బకు వడ్డీరేట్లు పైపైకి?

న్యూఢిల్లీ: ఈ ఏడాదికిగాను దేశ జీడీపీ వృద్ధి అంచనాలను అమెరికా బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్ మరోసారి తగ్గించింది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా భగ్గుమంటున్న విషయం తెలిసిందే. గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, ఎల్పీజీ, ఎల్ఎన్‌జీ ఉత్పత్తికి బ్రేకులుపడ్డాయి. భారత ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా.. మిడిల్ ఈస్ట్ నుంచి పెద్ద ఎత్తునే వస్తున్నది. ఈ నేపథ్యంలో ఈసారి దేశ ఆర్థిక వృద్ధిరేటు 5.9 శాతాన్ని మించి ఉండబోదని గోల్డ్‌మన్ సాచ్స్ తాజాగా అభిప్రాయపడింది. 2026లో దేశ జీడీపీ వృద్ధి 7 శాతంగా ఉండొచ్చని గతంలో గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. అయితే ఈ నెల 13న దీన్ని 6.5 శాతానికి తగ్గించింది. ఇప్పుడు 5.9 శాతానికి కుదించింది. కేవలం 11 రోజుల్లోనే అర శాతానికి (60 బేసిస్ పాయింట్లు) పైగా కోత పెట్టడం గమనార్హం. దీని వెనుక మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలే కారణంగా ప్రధానంగా కనిపిస్తున్నాయి. గత నెల 28 నుంచి ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడులను ప్రారంభించాయి. అప్పట్నుంచి గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అమెరికాకు మద్దతిస్తున్నారని పొరుగు దేశాలైన కువైట్, ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఇరాక్‌లపై ఇరాన్ దాడులు చేస్తున్నది. ఆయా దేశాల్లోని చమురు, గ్యాస్ క్షేత్రాలనే లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తున్నది. దీంతో క్రూడాయిల్, సహజ వాయువు ఉత్పత్తి నిలిచిపోయింది. పైగా మిడిల్ ఈస్ట్ నుంచి భారత్, చైనా సహా ఇతర దేశాలకు జరిగే రవాణాలో కీలకమైన హొర్ముజ్ జలసంధిని కూడా ఇరాన్ మూసేసింది. ఈ పరిణామం ఒక్కసారిగా గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు, గ్యాస్ ధరల పెరుగుదలకు దారితీసింది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో ఆయా పెట్రో ఉత్పత్తుల ధరలూ పెరిగాయి. గ్యాస్ కొరత కూడా కనిపిస్తుండగా, దేశవ్యాప్తంగా చాలా హోటళ్లు, ఇతర గ్యాస్ ఆధారిత వ్యాపారాలు, పరిశ్రమలు మూతబడుతున్నదీ చూస్తూనే ఉన్నాం. ఎరువుల తయారీ కుంటుబడి వ్యవసాయ రంగం సైతం ప్రభావితం అవుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇక రవాణా రంగంపైనా భారం పడుతుండగా.. పెరిగిన పెట్రోల్, డీజిల్ రేట్లతో ఆయా వస్తూత్పత్తులన్నింటి ధరలూ ఎగబాకి ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నది. ఇది మరింత ముదిరితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రాబోయే ద్రవ్య సమీక్షల్లో కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించే అవకాశాలు లేకపోలేదు. దీంతో వడ్డీరేట్లు పెరుగడం ఖాయమనే మెజారిటీ విశ్లేషకులు అంటున్నారు. అదే జరిగితే రుణ లభ్యత క్షీణించి అన్ని రంగాల్లో కార్యకలాపాలు మందగిస్తాయి. మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతుందని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది.

4.6 శాతానికి ద్రవ్యోల్బణం!

ముడి చమురు దిగుమతుల్లో ఏర్పడిన అంతరాయం.. దేశంలో అన్నింటి ధరల్ని ఎగదోయగలదని గోల్డ్‌మన్ సాచ్స్ హెచ్చరిస్తున్నది. ఈ క్రమంలోనే ఈ ఏడాది ద్రవ్యోల్బణం 4.6 శాతానికి పెరుగవచ్చని అంచనా వేస్తున్నది. గతంలో ఇది 3.9 శాతంగానే ఉండటం గమనార్హం. కాగా, హొర్ముజ్ జలసంధిలో వచ్చే నెల ప్రథమార్థం (ఏప్రిల్ 15) వరకు పరిస్థితులు ఇలాగే ఉంటాయన్న అభిప్రాయాన్ని గోల్డ్‌మన్ సాచ్స్ వెలిబుచ్చుతున్నది. దీంతో భారత్ జీడీపీ అంచనాలు ఇంకా తగ్గిపోయినా ఆశ్చర్యం లేదన్న సంకేతాలు వస్తున్నాయి. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయిలో కదలాడుతున్నది. దీంతో ఈ ఒత్తిడి ఆర్బీఐపై తప్పక ఉంటుందని, అందుకే రెపోరేటు 50 బేసిస్ పాయింట్లు (అర శాతం) పెరిగే వీలున్నదని గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేస్తున్నది. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా రూపీ వాల్యూ దాదాపు 4 శాతం పతనమైంది. సోమవారం తొలిసారి 94 మార్కునూ దాటేసింది. నిజానికి గత ఏడాది మొత్తంగా 4.7 శాతం పతనం నమోదైంది. కానీ ఈ 3 నెలల్లోనే ఇంచుమించుగా అంతటి నష్టాలు వాటిల్లాయి. రూపాయి విలువ పడిపోయినకొద్దీ దేశంలోకి వచ్చే దిగుమతులు ఖరీదవుతాయి. చివరకు ఈ భారం వినియోగదారులపైనే పడుతుంది. ఇక దేశీయ కరెంట్ ఖాతా లోటు జీడీపీలో ఈ సంవత్సరం 2 శాతానికి పెరుగవచ్చని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థపై విదేశీ రుణ భారం పెరుగుతుందని, డాలర్ నిల్వలు పడిపోయే వీలుందని అంటున్నది.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

- నాగారంలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో శిబిరం
- పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి: సర్పంచ్ సాలేహా సలీం

వలిగొండ, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధిని నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు ఎంతో అవసరమని నాగారం గ్రామ సర్పంచ్ సాలేహా సలీం పేర్కొన్నారు. బుధవారం నాగారంలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం, శీతాకాలం మారే సమయంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే ప్రమాదం ఉందన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులు నడవలేక ఇబ్బంది పడతాయని, నోటిలో పుండ్లు పడటం వల్ల మేత తీసుకోలేవని వివరించారు. సరైన సమయంలో టీకాలు వేయించకపోతే పశువులు మృత్యువాత పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర మల్లేశం, నరసింహ, పశుపోషకులు పాల్గొన్నారు.

బునాదిగాని కాలువపై 'బీర్ల' మాటలేనా?

- నీళ్లందిస్తేనే మీరు 'నీళ్ల ఐలయ్య'.. లేదంటే 'మోసపు ఐలయ్యే'!
- బీజేపీ నేత బొబ్బల ఇంద్రారెడ్డి ఘాటు వ్యాఖ్యలు

ఆత్మకూరు (ఎం), మార్చి 25 (తొలివెలుగు న్యూస్): బునాదిగాని కాలువ పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించినప్పుడే ఎమ్మెల్యేకు 'నీళ్ల ఐలయ్య' అన్న పేరు సార్థకమవుతుందని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు బొబ్బల ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో బునాదిగాని కాలువకు శంకుస్థాపన చేసి 20 ఏళ్లు గడుస్తున్నా నేటికీ చుక్క నీరు కూడా చెరువులకు చేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి, ఆ తర్వాత బూడిద భిక్షమయ్య గౌడ్, తదనంతరం పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ప్రాతినిధ్యం వహించినా కాలువ పనుల్లో పురోగతి లేదని దుయ్యబట్టారు. ఇప్పుడు అధికారంలో ఉన్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కూడా పాత పద్ధతినే అవలంబిస్తున్నారని విమర్శించారు. తనను తాను 'నీళ్ల ఐలయ్య' అని పిలుచుకుంటూ ప్రజలను మోసం చేయడం మానుకోవాలని, నిజంగా రైతుపై ప్రేమ ఉంటే యుద్ధ ప్రాతిపదికన కాలువను పూర్తి చేసి నీరు అందించి తన పేరును నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

కిడ్నీ బాధితురాలికి ఏజేఆర్ ఫౌండేషన్ భరోసా

- రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేసిన ఎలిమినేటి జంగారెడ్డి

వలిగొండ, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ పేద కుటుంబానికి ఏజేఆర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. వలిగొండ పట్టణానికి చెందిన తోట లక్ష్మమ్మ అద్దె ఇంట్లో నివాసం ఉంటూ రెక్కాడితే గానీ డొక్కాడని స్థితిలో జీవనం సాగిస్తోంది. అయితే, విధి వంచనతో ఆమె రెండు కిడ్నీలు పాడైపోయి ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో కొట్టుమిట్టాడుతోంది. వైద్య ఖర్చులకు కూడా డబ్బుల్లేని స్థితిలో ఉన్న లక్ష్మమ్మ దీనగాథను తెలుసుకున్న ఏజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఎలిమినేటి జంగారెడ్డి మానవత్వంతో స్పందించారు. బుధవారం బాధితురాలి నివాసానికి వెళ్లిన ఆయన, ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తక్షణ సహాయం కింద రూ. 10,000 నగదును బాధితురాలికి అందజేశారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ ఆపద సమయంలో తమను ఆదుకున్న జంగారెడ్డికి బాధితురాలు కన్నీటి పర్యంతమై కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మద్య రహిత గ్రామం దిశగా పులిగిల్ల యువత ముందడుగు

బెల్ట్ షాపులు వద్దు.. ఆరోగ్యం ముద్దు సర్పంచ్, కార్యదర్శికి గ్రామ యువత వినతి



వలిగొండ, మార్చి 25: (తొలివెలుగు న్యూస్): గ్రామంలో యువత మద్యానికి బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్న ఆవేదనతో పులిగిల్ల గ్రామ యువత ఐకమత్యంతో సామాజిక విప్లవానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్ట్ షాపులను తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం గ్రామ సర్పంచ్ వేముల అనూష, పంచాయతీ కార్యదర్శి జోగు సైదులుకు వినతిపత్రం అందజేశారు. మద్యపానం వల్ల కలిగే అనర్థాలను గుర్తించి, ఊరిని వ్యసనరహితంగా మార్చుకోవాలన్న పట్టుదలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ.. వీధి వీధినా లభిస్తున్న మద్యంతో యువత అనారోగ్యం పాలవడమే కాకుండా కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాలు, రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న ఉదంతాలు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. గ్రామస్తులందరి సహకారంతో బెల్ట్ షాపులను పూర్తిగా నిషేధిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వడ్డేమాన్ దేవేందర్, వార్డు సభ్యులు, గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చౌటుప్పల్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం

- తొలి సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్
- అన్ని వార్డుల అభివృద్ధియే నా ధ్యేయం

చౌటుప్పల్, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం పురపాలక సంఘ నూతన పాలకవర్గం సభ్యులతో జరిగిన మొట్టమొదటి సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. పట్టణాభివృద్ధే లక్ష్యంగా సాగిన ఈ సమావేశంలో ఎజెండాలోని పలు కీలక అంశాలపై కౌన్సిలర్లతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా ప్రతి వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళతామన్నారు. కౌన్సిలర్లు తమ వార్డుల సమస్యలను పరిష్కరించుకోవడంలో పూర్తి సహకారం ఉంటుందని, అదే సమయంలో పట్టణ సర్వతోముఖాభివృద్ధికి కౌన్సిలర్లంతా సహకరించాలని కోరారు. ఎజెండాలోని అంశాలపై లోతైన చర్చ అనంతరం మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రామిరెడ్డి పలు వివరణలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ గోపిశెట్టి వినయ్ కుమార్, 20 వార్డుల కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల ఫోరం కమిటీ ఎన్నిక.. 'మహిళా' సారథిగా మంజుల

- హక్కుల పోరాటమే లక్ష్యం: సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి
- జిల్లా ప్రధాన కార్యదర్శిగా గిర్కటి నిరంజన్ గౌడ్ ఎన్నిక

చౌటుప్పల్, మార్చి 25 (తొలివెలుగు న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచ్‌ల ఫోరం మహిళా విభాగం అధ్యక్షురాలిగా అల్లాపురం గ్రామ సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా దండు మల్కాపురం సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వివేరా హోటల్‌లో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సౌధాని భూమన్న యాదవ్ ఆధ్వర్యంలో 'జిల్లా సర్పంచ్‌ల చైతన్య సదస్సు' నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు, సర్పంచ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, ఫోరం ప్రధాన కార్యదర్శి కీర్తి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.